## జనవరి 29 నాటికి అనుమతులు తీసుకోవాలి : కలెక్టర్

**విశాలాంధ్ర-శ్రీకాకుళం :** జనవరి 29 నాటికి అనుమతులు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ స్పష్టం చేశారు. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌కు సంబంధించి ఫైన్స్ పై జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి ఆయన సమీక్షించారు. 5 సంవత్సరాల వరకు గ్రానైట్ వేస్టేజ్ వేసేందుకు ఎంత భూమి అవసరమో గుర్తించాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శంకర్ నాయక్‌ను ఆదేశించారు. గ్రానైట్ వేస్టేజ్‌ను డంపింగ్ చేసుకోవచ్చన్నారు. గ్రానైట్ వేస్టేజ్ డంపింగ్ యార్డులో వేసినప్పుడు పొల్యూ షన్ కంట్రోల్ బోర్డు నిబంధనలకు లోబడి ఉండాలని తెలిపారు. డంపింగ్ సైట్ వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని మైన్స్ డిడి ఫణి భూషణ్ రెడ్డిని ఆదేశించారు. అనుమతులు లేకుండా గ్రానైట్ కంపెనీలు బోర్లు వేసినట్లు భూ గర్భగణులు శాఖ డిడి సత్యజీవన్ చెప్పారు. అనుమతులు ఎన్ని ఉన్నాయో పరిశీలించి రిపోర్టు అందజేయాలని డిడిని ఆదేశించారు. ఎన్.జి.టి. నిబంధనలకు అనుసరించి ఉండాల న్నారు. భూగర్భ గణులు శాఖ నుంచి అనుమ తులు తీసుకుంటామని గ్రానైట్ యాజమాన్యం చెప్పగా జనవరి 29వ తేదీ నాటికి అనుమతులు తీసుకోవాలని, జనవరి 29 తర్వాత అయితే పెనాల్టీతో అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు. సంవత్సరంలో వచ్చే టర్నోవర్ పై పెనాల్టీ వేయాలని కమర్షియల్ టాక్స్ సహాయ కమీషనర్‌ను ఆదేశించారు. 4.10 లక్షల కొలత (సర్వే) రాళ్లు అవసరం ఉందన్నారు. గ్రామాల వారీగా పూర్తిగా సరఫరా చేయాలని తెలిపారు. సర్వే రాళ్లకు సంబంధించిన రామెటీరియల్ పంపాలని మైన్స్ డిడిని ఆదేశించారు. సర్వే రాళ్లు త్వరితగతిన సరఫరా చేయాలని చెప్పారు. రహదారులపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కు సంబంధించి క్వారీ వేయడంపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శంకర్ నాయక్ వివ రించారు. ఈసమావేశంలో మైన్స్ డిడి ఫణి భూషణ్ రెడ్డి, భూగర్భ శాఖ డిడి సత్యజీవన్, కమర్షియల్ టాక్స్ సహాయ కమీషనర్ టి. శ్రీనివాసరావు, గ్రానైట్ అసోసియేషన్, తది తరులు పాల్గొన్నారు.

## గుండ్యాలపుట్టుగలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి

**విశాలాంధ్ర-కవిటి :** మండలంలోని కవిటి గ్రామ పంచాయతీలోని గొండ్యాలపుట్టుగ గ్రామం లో మండల తెదేపా నాయకులు ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.గత మూడున్నర సంవత్సరాల్లో రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య అధికమైందని, ఆడబిడ్డలకు భద్రత లేదని,నిత్యవసర వస్తువులు పైన రెట్టింపు రేట్లతో పేదలకు అందకుండా పోయిందని, రాష్ట్రం లో అభివృద్ధి శూన్యమని, గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్రానికి రాజధాని ఏదో తెలియక ప్రజలు అయోమయంలో ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం చెందిందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబునాయుడు మళ్ళీ సీఎం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ జెడ్పిటిసిలు పొందల కృష్ణారావు, బెందాలం రమేష్, మాజీ ఏఎంసి చైర్మన్ సిపాన వెంకట రమణ,మణిచంద్రప్రకాష్, బాస్ దేవ్ రౌల్లో, బి విజయ్ కృష్ణ, ఐటిడిపి రాష్ట్ర కార్యదర్శి పుల్లటరాజు, లోల్ల శ్రీనివాస్, ఎర్రబాసు ప్రధాన్,రఘుపాత్రుని శ్రీనివాసరావు పట్నాయక్, బెందాలం తిరుమలరావు, సదానంద రౌల్లో, ఆరంగి రాజు, వజ్జ రంగారావు, డి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**విశాలాంధ్ర-సంతబొమ్మాళి :** ఈ మండలం చరణ దాసువరం గ్రామానికి చెందిన చదునువల్లి వెంకటరమణ, అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదుచేసి నట్లు సంతబొమ్మాళి ఎస్ఐ కె.మధుసూదనరావు తెలిపారు. వాహనాలు తనిఖీ చేసిన సమయంలో, ట్రాక్టర్ పేపర్లు పరిశీలించారు, ఇసుక రవాణాకు ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో, ట్రాక్టర్ సీజ్ చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఉమాపతి సేవలు ఆదర్శం

### ఎమ్మెల్యే అశోక్

**విశాలాంధ్ర-సోంపేట :** జిల్లా కేంద్ర వ్యవసాయ సహకార బ్యాంకులో ఉద్యోగిగా పని చేసి రైతులకు విశేష సేవలందించిన మద్దు ఉమాపతి ఆదర్శనీయు డని ఇచ్చాపురం ఎమ్మెల్యే డాక్టర్ అశోక్ పేర్కొన్నారు. ఇటీవల ఉమాపతి మరణించడంతో ఆయన సంతాప సభ బుధవారం సోంపేటలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ అశోక్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ప్రతి గ్రామానికి ఉమాపతి సుపరిచితుడని అన్నారు. బదకల మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కంచిలి జెడ్పీటిసి ప్రతినిధి ఇప్పిలి కృష్ణా రావు, మద్దిల నాగేశ్వరరావు, సూరాడ చంద్రమోహన్, కె.వెంకటరమణ, జి.రమేష్, బొందాడ పురుషోత్తం, బాబూరావు, లోకనాథం, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ ఉపాధ్యాయ జీతాల బకాయిలు వెంటనే చెల్లించాలి

### ఏఐటియుసి డిమాండ్

**విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ :** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయి పడిన నవంబరు నెల జీతాలు వెంటనే చెల్లించా లని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి అనపాన షణ్ముఖరావు డిమాండ్ చేశారు. బుధవారం శ్రీకాకుళం రామలక్ష్మణ జంక్షన్ వద్ద గల కామ్రేడ్ ఎన్.ఆర్.దాసరి క్రాంతి భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు వారాలు దాటిన రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు నవంబరు నెల జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. జీతాలతోపాటు టిఏలు, అరియర్స్ కూడా బకా యిలు ఉన్నాయన్నారు. సమస్యల పరిష్కారం కొరకు శాంతియుతంగా పోరాడుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులపై ప్రభుత్వం పెట్టిన కేసులు ప్రభుత్వం తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. హక్కులు, సమస్యలు పరిష్కారానికి నిరసన తెలపడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని గుర్తు చేశారు. మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడినట్లు కాళ్ళు పట్టుకుంటే సమస్య పరిష్కారం కాదని, ఇది బానిస సమాజం కాదని అన్నారు. బ్రిటీష్ కాలంలోనే పోరాడి అనేక చట్టాలు సాధించుకున్న ఘన చరిత్ర భారత కార్మిక ఉద్యమానికి ఉన్న విషయం మంత్రి మరచిపోయారేమో అన్నారు. ప్రభుత్వం వెంటనే జీతాలు, టి.ఏ., అరియర్స్ బకాయిలు చెల్లించా లని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసి నాయకులు పంచిరెడ్డి అప్పారావు, డిహెచ్‌పిఎస్ నాయకులు యడ్ల గోపి, బలగ రామారావు, బి.గణేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఎం.భాస్కరరావు, కె.కృష్ణ, కొల్లి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## 'అరసం' జిల్లా అధ్యక్షునిగా నల్లి ధర్మారావు

**విశాలాంధ్ర-శ్రీకాకుళం :** అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా అధ్యక్షునిగా కవీ,జర్నలిస్టు నల్లి ధర్మారావు నియమితుల య్యారు. గుర్రం జాషువా అవార్డు,రాష్ట్ర ప్రభుత్వ తెలుగు అకాడమీ అవార్డులు అందుకున్న ధర్మా రావు తెలుగు సాహిత్య, జర్నలిజం రంగాలకు సుపరిచితులు. ప్రధాన కార్యదర్శిగా మరో సీనియర్ జర్నలిస్టు, కవి చింతాడ కృష్ణారావు నియమితులయారు. ఉపాధ్యక్షులుగా విశ్రాంత ప్రిన్సిపాల్, కవయిత్రి డా.జ్యోతి ఫ్రెడరిక్, కార్యదర్శులుగా కవి కలమట దాసుబాబు, కవయిత్రి బొడ్డేపల్లి కనక లక్ష్మి నియమితుల య్యారు. గౌరవ సలహాదారుగా ప్రముఖ కవీ, సీనియర్ జర్నలిస్ట్ అరుణ్ బవేరా నియమితుల య్యారు. ఆయన ఇంతవరకు జిల్లా ప్రధాన కార్యదర్శిగా వున్నారు. కార్యవర్గ నియామకాన్ని జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీ నారాయణ, రాష్ట్ర అధ్యక్షులు ఆచార్య రాచపాళెం రామచంద్రా రెడ్డి ఆమోదంతో జరిగింది. రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు,ప్రముఖ రచయిత, ఆచార్య వెలమల శిమ్మన్న శుభాకాంక్షలు తెలిపారు. త్వరలో పూర్తిస్థాయి కార్యవర్గం ఏర్పాటు చేస్తా మని నల్లి ధర్మారావు తెలిపారు. 80ఏళ్ల చరిత్రగల సాహితీ సంస్థలో పనిచేయడం గొప్ప భాగ్యమ న్నారు. ఫిబ్రవరిలో తెనాలిలో రాష్ట్ర మహాసభలు జరుగు తాయని తెలిపారు. కళింగాంధ్రకు వన్నె తెస్తున్న ప్రముఖ రచయిత, నవలాకారుడు అట్టాడ అప్పల నాయుడి దిశా నిర్దేశంలో 'అరసం' గౌర వాన్ని పెంచేవిధంగా పనిచేస్తామన్నారు. తమ నియామ కం వెనుక నిర్ణయాలు తీసుకున్న పెద్దలకు కార్య వర్గం తరపున ధర్మారావు ధన్యవాదాలు తెలిపారు.

## జగనన్న శాశ్వత భూహక్కు పథకంతో అందరికీ న్యాయం

### సర్పంచ్ సంజీవరావు

**విశాలాంధ్ర-కోటబొమ్మాళి :** జగనన్న శాశ్వత భూహక్కు పథకం ద్వారా గ్రామాల్లో నిర్వహిస్తున్న భూసర్వేతో ప్రతీ ఒక్కరికి న్యాయం జరుగుతుందని కోటబొమ్మాళి మేజరు పంచాయతీ సర్పంచ్ కాళ్ళ సంజీవరావు అన్నారు. బుధవారం స్థానిక పంచా యతీ కార్యదర్శి రఘుపాత్రుని యోగేశ్వరరావు ఆధ్వర్యంలో జగనన్న భూహక్కు సర్వే పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎన్నోఏళ్ళుగా పరిష్కారం కాని భూ సమస్యలు ఈ సర్వే ద్వారా పరిష్కారం జరుగు తుందని దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకో వాలని, అలాగే రైతులు అధికారులకు సహకరి ంచాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కమ్మకట్టు శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ అనపాన బాలకృష్ణ, ఇర్రి చిరంజీవి, తంగుడు మురళి, మండల సర్వేయర్లు, వీఆర్వో పేడాడ అకిల్ తదితరులు పాల్గొన్నారు.

### పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**విశాలాంధ్ర-పలాస :** పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలని, చెత్తను ఎక్కడిపడితే అక్కడ వేయకూడదని పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ అన్నారు. బుధవారం వార్డుల్లో పర్యటించి ప్రజలకు చెత్త, పారిశుద్ధ్యంపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల్లో చెత్తను బయట వేయకుండా చెత్త బండిలో మాత్రమే వేయాలని అన్నారు.

## ఉత్సాహంగా క్రీడా పోటీలు

**విశాలాంధ్ర -ఆమదాలవలస:** మండలం తొగరాం ఉన్నత పాఠశాల మైదానంలో జరుగుతున్న జోనల్ స్థాయి గ్రిగ్స్ క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. మంగళవారం ప్రారంభమైన ఈ క్రీడా పోటీలు శుక్రవారం వరకు కొనసాగులున్నాయి. కబాడీ కోకో షటిల్ వాలీబాల్ రన్నింగ్ పోటీలను నిర్వహించారు. రెండు రోజులుగా బాలురు క్రీడల్లో పాల్గొనగా నేటి నుండి బాలికలు క్రీడా పోటీల్లో పాల్గొను న్నారు. రణస్థలం జిసి గడాం లావేరు పొందూరు ఎచ్చెర్ల ఆముదాలవలస సరుబుజ్జిలి బూర్జ మండలాలకు చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. జోనల్ స్థాయి క్రీడల నిర్వహణతో పాఠశాల ఆవరణ సందడిగా నెలకొంది. ఈ పోటీలో నిర్వహణకు

పాఠశాల స్వర్ణోత్సవ కమిటీ ఆధ్వర్యంలో రూబీ పదివేల రూపాయలు నగదు విరాళంగా అందజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు మొజ్జడ వెంకటరమణ కార్యదర్శి బొడ్డేపల్లి సురేష్ వ్యాయామ ఉపాధ్యాయులు పాతిన రమేష్ సాంబ మూర్తి బివి రమణ మాధవరావు పోలినాయుడు శ్రీనివాసరావు సుశీల ఎస్.రవి స్థానిక నాయకులు తమ్మినేని శ్రీరామ్ మూర్తి చంద్రశేఖర్ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మహిళా పోలీసుకు ప్రశంసాపత్రం

**విశాలాంధ్ర-సోంపేట :** కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలో సోంపేట మండలం పలాసపురం మహిళా పోలీసు ఎర్ర ధనలక్ష్మి జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక ప్రశంసాపత్రం అందజేశారు. మహిళా పోలీసుగా మహిళలను చైతన్యపర్చడంలో విశేష సేవలు అందించినందుకు గాను ధనలక్ష్మిని శ్రీకాకుళంలో జరిగిన ఒక కార్యక్రమంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో కాశీబుగ్గ డిఎస్పీతో పాటు సోంపేట సిఐ రవిప్రకాష్ పాల్గొన్నారు. ధనలక్ష్మి సేవలు గుర్తించడం పట్ల పలాసపురం గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఆమెను అభినందిస్తున్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

### మాజీ ఉప ముఖ్యమంత్రి, ధర్మాన కృష్ణదాస్

**విశాలాంధ్ర-నరసన్నపేట :** మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలనే ధ్యేయంతో రాష్ట్ర ముఖ్యమంత్రి, వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి, ధర్మాన కృష్ణదాస్ అన్నారు. బుధవారం రూ.24లక్షలతో ఏర్పాటు చేసిన చేయూత మహిళ మార్టును ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళా చైతన్యంతోనే ఆర్థిక వికాసం సాధ్యమవుతోందని, ప్రతీ సంక్షేమ పథకాన్ని మహిళల పేరుతో ముఖ్యమంత్రి మంజూరు చేస్తున్నారని తెలిపారు. మండలంలోని 22,434మంది సభ్యులు మహిళా సంఘాల్లో వుండగా, వీరు ఒక్కొక్కరూ రూ. 110 సమకూర్చుకొని, సుమారు రూ.24 లక్షలతో స్వంతంగా ఈ మార్టును ఏర్పాటు చేసుకోవటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మహిళా

సమాఖ్య ప్రతినిధులకు రూ.18లక్షల చెక్కును అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి, ఆరంగి మురళీధర్, జెడ్పీటిసి, చింతు అన్నపూర్ణ, మేజర్ పంచాయితీ సర్పంచ్, బుర్లి శంకరరావు, వైస్ సర్పంచ్, సాసుపల్లి కృష్ణబాబు, వైసిపి ప్రతినిధులు వైశ్యరాజు కేశవరాజు, పుట్టా ఆదిలక్ష్మీ, సవర శైలజ, ముద్దాడ బైరాగినాయుడు, బోయిన బాలకృష్ణ, రమణ సాహు, రాజాపు అప్పన్న, బార్ల వేణుగోపాలరావు, ఎంపిడివో, బి.మధుసూధన రావు, వెలుగు ఏజిఎం, సత్యన్నారాయణ, ఏరియా కోఆర్డినేటర్, కొండలరావు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, చింతు శ్రీదేవి, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జింకిభద్రలో అభివృద్ధి జాతర

**విశాలాంధ్ర - సోంపేట :** ఈ మండ లం జింకి భద్ర గ్రామ సచివాలయ పరిధిలో అనేక అభివృద్ధి పను లకు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ, ఎంపిపి డాక్టర్ నిమ్మన దాసు బుధవారం శంకుస్థాప నలు చేశారు. సామా జిక భవనాలు, పాఠశాల కళావేదిక, సిసి రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేయడంతో పాటు ఓటీఎస్ గృహహక్కు పత్రాలు కూడా పంపిణీ చేయడంతో పెద్దసంఖ్యలో హాజరైన ప్రజానీకంతో ఈ వేడుక జాతరను తలపించింది. ఈసందర్భంగా ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యలను గుర్తించి ఒక్కొక్క నియోజకవర్గానికి కోట్లాది రూపాయలు మంజూరు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ తామాడ పద్మావతి శేఖర్, మత్స్యకార కార్పోరేషన్ డైరెక్టర్ మద్దు రాజారావు, వార్డు సభ్యులు, ఉపసర్పంచ్ జానకిరావు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పంట రుణాల రాయితీలో రైతులకు మొండి చెయ్యి

### జనసేన నాయకులు పనపాన లింగరాజు

**విశాలాంధ్ర-కవిటి :** పంట రుణాలు సకాలం లో చెల్లించిన రైతులకు రాయితీ చెల్లింపుల్లో రాష్ట్ర ప్రభుత్వం మొండి చెయ్యి చూపిందని జనసేన నాయకులు పనపాన లింగరాజు ఒక ప్రకటనలో ఆరోపించారు.ఇటీవల ఏపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రైతులందరికీ వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు పేరుతో రాయితీ సొమ్ము వారు ఖాతాల్లో జమ చేయడం జరిగిందనీ తెలిపారు. కానీ మండలంలోని కొజ్జిరియా పంచాయతీ పరిధిలో మొత్తం సుమారు 1100 ఎకరాలు రెవెన్యూ భూమి విస్తీరణం కలిగి ఉందని

తెలిపారు. భారీ సంఖ్యలో భూములున్న పంచా యితీలో కేవలం ఇద్దరు రైతులకు మాత్రమే సున్న వడ్డీ నగదు జమ కావటం ఆశ్చర్యంగా ఉందని అన్నారు. అర్హులైన ఎంతోమంది రైతులకు గుర్తించకపోవడం విడ్డూరంగా ఉందని, ప్రభుత్వం కావాలనే ఇలాంటి చర్యలకు పాల్పడుతుందా? లేదా అధికారుల నిర్లక్ష్యమా? అర్థంకాని పరిస్థితి ఉందని అన్నారు.ఈ సమస్యపై సంబంధిత అధికారులు,జిల్లా కలెక్టర్ స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.అర్హులైన రైతులను గుర్తించి సున్నా వడ్డీ రుణాల రాయితీ అర్హులైన ప్రతి ఒక్కరికి వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

## డాక్టరేట్ పొందిన అధ్యాపకునికి సన్మానం



**విశాలాంధ్ర-పొందూరు :** మండలకేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ కె. సూర్యారావుకు బుదవారం కళాశాలలో ఘనంగా సన్మానించారు. ఇటీవల ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్‌ఐ పూర్తిచేసి ఏయూ వైచాన్సలర్ ప్రొఫెసఱ ప్రసాదొడ్డి చేతులమీదుగా డాక్టరేట్ పట్టా పొందారు. ఏయూ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి. లిల్లీ గ్రేస్ యూనిస్ పర్యవేక్షణలో భారతీయ రాష్ట్రాలలో ప్రజల ఆరోగ్యవ్యయం- ప్రభావం అనే అంశంపై పరిశోధనకుగాను డాక్టరేట్ సాధించారు. డాక్టరేట్ సాధించిన సూర్యారావును కళాశాల ప్రిన్సిపాల్, రామారావు. విద్యార్థులు సహ అధ్యాపకులు దుశ్శాలువతో సన్మానించారు.

## రైస్ మిల్లు యజమాని, ప్రైవేటు ఎలక్ట్రీషియన్ దుర్మరణం

### మరొకరికి గాయాలు

**విశాలాంధ్ర-ఎచ్చెర్ల :** అజాగ్రత్త వల్లే రెండు నిండు ప్రాణాలు గాలిలోకి కలిసిపోయాయి. మరొకరు గాయపడ్డారు. రైస్ మిల్లు ఆవరణలో బయట భాగంలో పాడైన బల్బును మార్చే క్రమంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపవడంతో రైస్‌మిల్లు యజమానితోపాటు ప్రైవేటు ఎలక్ట్రీషి యన్ అక్కడకక్కడే దుర్మరణం చెందారు. విద్యుత్ తీగలు యమపాశాలై ఇద్దరి ప్రాణాలను బలి తీసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఎచ్చెర్ల మండలం కుశాలపురం గ్రామానికి సమీపంలోని నవభారత్ పారిశ్రామికవాడకు ఆనుకుని ఉన్న శ్రీదేవి మోడర్న్ రైస్‌మిల్లు ఆవరణలో బుధవారం జరిగిన విద్యు ద్ఘాతంలో మిల్లు యజమాని కుశాపురం వైసీపీ నేత పైడి రవి(47), ప్రైవేటు ఎలక్ట్రీషియన్ సీపాన దనుంజయరావు(31)లు అక్కడకక్కడే మృతి చెందారు. విద్యుత్ బల్బును మార్చే సమయంలో హెచ్‌టీ విద్యుత్ లైనుకు ఐరన్ నిచ్చెన తాకడంతోనే ఈ ప్రమాదం జరిగింది. ఇదే సంఘటనలో వారిని రక్షించే క్రమంలో మిల్లులో పనిచేస్తున్న కూలి కొత్తకోట నర్సింహులు (ఫరీద్‌పేట),గాయపడి శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఓవైపు వ్యాపారం చేసుకుంటూ మరోవైపు రాజకీయాల్లో చురుకుగా పాత్ర పోషిస్తున్న రవికి భార్య శ్రీదేవి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ధనుంజయరావు భార్య ఈశ్వరమ్మతో పాటు మూడేళ్ల కుమారుడు ఉన్నారు. సుమారు నాలుగేళ్ల క్రితమే ధనుంజయరావుకు వివాహమైంది విద్యుత్ ఘాతానికి గురైన వీరిని చికిత్స నిమిత్తం హుటాహుటిన శ్రీకాకుళంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విద్యుత్ శాఖ అధికారులు సంఘటన స్థలాన్ని సందర్శించారు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హెల్త్ కార్డుల మంజూరుపై దృష్టి సారించండి

**విశాలాంధ్ర -కంచిలి :** సచివాలయాల పరిధిలో పీఎం జేఏవై హెల్త్ కార్డుల మంజూరు కు సిబ్బంది దృష్టి సారించాలని ఎంపీడీవో చల్లా శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలంలోని పోలేరు, డిజిపురం, ము డల, కుమ్మరి నౌగం సచివాలయాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది, స్థానిక గ్రామ వాలంటీర్లతో సమీక్ష సమావేశాలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ఈ హెల్త్ కార్డుల మంజూరు పై దృష్టి సారించాలన్నారు. ఈ కార్డులు ఉంటే దేశంలో ఎక్కడ ప్రమాదం జరిగిన ఈ కేవైసీ ద్వారా సహాయాన్ని పొందవచ్చు అన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించి హెల్త్ కార్డుల మంజూరు త్వరితగతిన చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన కుల ధ్రువీకరణ పత్రాల మంజూరుకు సంబంధించి వీఆర్వోల ఫోన్లో ప్రత్యేక యాప్లు ఉన్నాయని, వాటి ద్వారా ధ్రువపత్రాల మంజూరు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## పెద్దశ్రీరాంపురంలో ఆర్టీసీ సర్వీసు ప్రారంభం

**విశాలాంధ్ర-కంచిలి:** మండలంలోని పెద్ద శ్రీరాంపురం గ్రామంలో బుధవారం స్థానిక జడ్పీ చైర్పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ ఆర్టీసీ బస్సు సర్వీసును జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సర్వీసు నడిపేందుకు అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు. అంతకు ముందు గ్రామ నికి చెందిన ఎస్ సీతారాం ఇటీవల మృతి చెందడంతో అతడి కుటుంబ సభ్యులకు పదివేల రూపాయల తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు జడ్పిటిసి ఇప్పిలి లోలాక్షి, ఎంపీపీ

పైల దేవదాస్ రెడ్డి, సర్పంచ్ బల్లెడ సుమన్, యారాడ ఆనందరావు, వైసీపీ మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయం, ఇప్పిలి కృష్ణారావు, పలాస డిపో మేనేజర్ శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్ టి.సంతోష్, నాయకులు తిరుపతిరావు, మోహన్‌రావు, భాస్కరరావు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## లండన్ వర్సిటీలో రాణించిన ఎమ్మెల్యే శాంతి తనయుడు



**విశాలాంధ్ర-హిరమండలం :** పాతపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే రెడ్డి శాంతి రెండో కుమారుడు ఓం శ్రీకృష్ణ లండన్‌లోని మాంచస్టర్ యూనివర్సిటీ డీన్ చేతులమీదుగా మంగళవారం పట్టాను పొందారు. ప్రపంచంలోలోనే ప్రథమ స్థానం లోనిలిచిన యూనివర్సిటీల్లో లండన్‌లోని మంచస్టర్ యూనివర్సిటీ ఒకటి అందులో సీటు దొరకాలంటే చదువులో నిష్ణతుడై ఉండాలి, ఈ యూనివర్సిటీ లో మెడికల్ అండ్ హెల్త్ విభాగంలో పాకాల్టీ ఆఫ్ బయోలాజీ పోస్టు గ్రాడ్యుయేట్ పట్టాను ఓం శ్రీకృష్ణ పొందారు. ఈ సందర్భంగా నియోజకవర్గం లోని వైస్సార్సీపీ శ్రేణులు, ప్రజలు, మండలవైస్సార్సీపీ అధ్యక్షులు మీసాల రామకృష్ణ, పిఎసిఎస్ అధ్యక్షులు అంధవరం వెంకట్ సురేష్, బూర శ్రీనివాస్, గొర్లె సురేష్, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పన్నుల వసూలు వేగవంతం చేయండి

**విశాలాంధ్ర-ఇచ్ఛాపురం :** స్థానిక మున్సిపాలిటీ లో రెవిన్యూ వసూళ్ళ తగ్గుముఖంతో అభివృద్ధికి అవరోధం కల్గుతుందని మున్సిపల్ ఛైయిర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అన్నారు. బుధవారం మున్సిపల్ కమీషనర్ ఎన్.రమేష్ ఆధ్వర్యంలో రెవిన్యూ సిబ్బంది, అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీలతో సమీక్ష జరిపారు. ఛైయిర్‌పర్సన్ ఈ సందర్భంగా మాట్లా డుతూ ఆస్తి పన్ను, ఖాళీ స్థల పన్నులు, త్రాగు నీటి కుళాయి వసూళ్ళు తక్కుగా ఉన్నాయని క్షేత్రస్థాయి సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. కమీషనర్ మాట్లాడుతూ పన్ను వసూ ళ్ళకు బృందంగా వెళ్తూ వసూళ్లు వేగవంతం చేయడంతో పాటు సచివాలయాల అడ్మిన్ సెక్రటరీ ల నిర్దేశిత లక్ష్యాల మేరకు ఫిబ్రవరి నెలాఖరు



నాటికి 90శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. మొత్తం ఆస్థి పన్ను 3కోట్ల 68లక్షలకు గాను 2కోట్ల 64 లక్షలు బకాయిలు ఉన్నాయని, ఖాళీ స్థలం పన్నుల మొత్తం 1కోటి 28లక్షలకు గాను 1కోటి 25 లక్షలు బకాయి, త్రాగు నీటి కుళాయి ఛార్జీలు 45 లక్షల 13 వేలకు గాను 40లక్షల 28 వేలు బకాయిలు ఉండగా ప్రతీ వారం సచివాలయ అడ్మిన్ సెక్రటరీలకు లక్ష్యాలు నిర్దేశించి బకాయిల వసూళ్ళను పూర్తి చేయాలని ఆదేశించారు.

## రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో కవిటి విద్యార్థుల ప్రతిభ

**విశాలాంధ్ర-కవిటి:**రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీలలో కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభచూపి బహుమతులు సాధిం చారు. ఈనెల 12, 13 తేదీలలో విజయ వాడలో జరిగిన రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీలలో శ్రీకాకుళం జిల్లా నుండి ప్రాతినిధ్యం వహించిన కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించారు. శాస్త్రీయ సంగీతం గాత్రం విభాగంలో కవిటి మండలం కపాసుకుద్ది గ్రామానికి చెందిన చలపరాయి చాణిక్యచంద్ర రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఏకపాత్రాభి నయం మోనో యాక్షన్ సోలో డ్రామా విభాగంలో కవిటి మండలం గుండ్యాల పుట్టుగ గ్రామానికి చెందిన నెయ్యిల మణి వర్మ తృతీయ స్థానం సాధించాడు. వచ్చేనెల భువనేశ్వర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు చాణుక్యచంద్ర ఎంపిక య్యారు. విద్యార్థులను వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు పీబీకే శర్మను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.మల్లేశ్వరరావు, సర్పంచ్ పూడి లక్ష్మణరావు, మండల కో ఆప్షన్ సభ్యులు పాండవ చంద్రశేఖర్, పిఎంసి చైర్మన్ మొగిలిపూరి కృష్ణారావు, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్తులు, పెద్దలు అభినందించారు.

## రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

**విశాలాంధ్ర-కంచిలి :** ధాన్యం కొనుగోలు చేసే విషయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తహసిల్దార్ హైమావతి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం కుత్తుమ గ్రామంలో వ్యవసాయ అధికారి ధనుంజయ రావు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు జరపాలన్నారు.

ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాల మేరకు రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించాలన్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుడా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవోతో పాటు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## కొల్లు మాటలను వెనకకు తీసుకోవాలి

విశాలాంధ్ర-మందస : గుంటూరు సభలో టీడీపీ బి.సి సెల్ అధ్యక్షులు కొల్లు రవీంద్ర మాట్లాడుతూ వడ్డెరలను గిరిజన జాబితాలో చేర్చితీరుతామనే మాటలను వెనకకు తీసుకోవాలని ఆదివాసి వికాస పరిషత్ అధ్యక్షులు జగన్ డిమాండ్ చేశారు. ఇప్పటికే బోయలను అసెంబ్లీ తీర్మాణం చేసి పంపినందుకు గిరిజనులు టీడీపీని పక్కన పెట్టిందని, అలాగే ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం తీరుతో గిరిజనులకు తీరని అన్యాయం జరుగుతుందని అన్నారు. ఇలాగే కొనసాగితే వైసీపీ, టీడీపీ పార్టీలను గిరిజన గ్రామాల్లో తిరగనివ్వమని హెచ్చరించారు. కార్యక్రమంలో విజయ్, సోమేష్, సీతారాం, డొంబురు, బాలక్రిష్ణలు పాల్గొనానరు.

## ఘనంగా శివైక్య ప్రతీక్ష నివాస్ ప్రారంభం

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట సమీపంలో గల సీతయ్య ఫౌండేషన్ వానప్రస్థాశ్రమంలో వయోవృద్ధులు, అనాధలు అంతిమ దశలో అనారోగ్యం బారినపడి అష్టకష్టాలు పడే పరిస్థితుల్లో వారికి అవసరమైన సదుపాయాలతో నిర్మించిన ప్రత్యేక వసతి భవనం శివైక్య ప్రతీక్ష నివాస్ ప్రారంభం బుధవారం ఘనంగా నిర్వహించారు. అనేక మంది దాతల సహకారంతో ఆశ్రమ నిర్వాహకులు గుల్ల మోహనరావు సోదరులు చేపట్టిన ఈ కార్యక్రమంలో దాతలు హాజరయ్యారు. ఇటువంటి భవన నిర్మాణం పట్ల ప్రతి ఒక్కరు నిర్వాహకుల

## వాలంటీర్లపై తప్పుడు రాతలు మానుకోవాలి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : ఈనాడు దినపత్రిక వాలంటీర్లు గూడచారులు అని కించపరిచి వ్రాసే తప్పుడు రాతలుమానుకోవాలి కోటబొమ్మాళి సచివాలయం-1,2లతో పాటు పలు సచివాలయాల వాలంటీర్లు బుధవారం మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తూ ఈనాడు ఎండీ రామోజీరావు డౌన్‌డౌన్ అంటు నిరసన తెలిపి దిష్టిబొమ్మాను తగలబెట్టారు. గ్రామ వాలంటీర్లు జగన్‌మోహన్‌రెడ్డి పనివారిల, జగన్‌మోహన్‌రెడ్డికోసం పనిచేసే వారిగా చూస్తూ మమ్మల్ని అవమానిస్తూ వ్రాస్తున్న కథనాలను మేము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మా సేవలు ప్రజలకు అందకపోయినా, ఇతర పార్టీలకు చెందిన వారికి మేము సంక్షేమ పథకాలు మంజూరు చేయకపోయిన దీనిపై రాయాలనికాని ఇలా తప్పుడు రాతలు రాసి మమ్మల్ని కించపరచవద్దుయన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో గ్రామ వలంటీర్లు గందాపు ప్రశాంత్, జలుమూరు మాధవయ్య, దేవాది గణేష్, సిమ్మ అప్పన్న, సాయిప్రశాంత్, దేవాది దుర్గాప్రసాద్, రఘుపాత్రుని ప్రవీణ్, నెయ్యిల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అన్యమత ప్రచారంపై ఆందోళన : పోలీసులు జోక్యం

విశాలాంధ్ర- ఎచ్చెర్ల : శ్రీకాకుళం సింహద్వారం కుశాలపురంవద్ద ఫ్లైఓవర్ దిగువ భాగంలో బుధవారం అన్య మత ప్రచారంపై ఆందోళన చెలరేగింది.విశాఖపట్నం, పెందుర్తి, తగరపువలస మీదుగా క్రైస్తవ ప్రచారం చేసుకుంటూ కొంతమంది కుశాలపురం సింహద్వారం వద్దకు చేరుకొని ఇక్కడ ఫ్లైఓవర్ దిగువ భాగంలో జిల్లా ప్రాముఖ్యతను చాటే హైందవ దేవాలయాల చిత్రాలు ఉన్నచోట క్రైస్తవ మత ప్రచారానికి అనుకూలంగా రాతలు రాయడాన్ని స్థానికులు గుర్తించి అడ్డు చెప్పారు. విషయం తెలుసుకున్న భజరంగదళ్, విహెచ్‌పి కార్యకర్తలు అక్కడికి చేరుకొని మతప్రచారకులతో వాగివాదానికి దిగారు స్థానిక యువకులు భజరంగ్ కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి నిరసనగా నినాదాలు చేశారు. సమాచారం తెలుసుకున్న ఎచ్చర్ల ఎస్సై వి.సత్యనారాయణ చేరుకుని ఇరువు రికి సర్ది చెప్పి పోలీస్ స్టేషన్కు తరలించారు. అలాగే అన్య మత ప్రచార రాతలను కూడా చెరిపించారు. ఈ విషయమై ఎస్‌ఐ సత్యనారాయణతో మాట్లాడగా ఈసంఘటనపై ఎలాంటి కేసు నమోదు కాలేదన్నారు.

## 11 రోజులకే ధాన్యం డబ్బులు జమ : రైతు హర్షం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ప్రభుత్వం రైతులనుండి ధాన్యం కొనుగోలు చేసి 21 రోజులకు డబ్బులు జమ చేస్తామని చెప్పినప్పటికీ 11 రోజులకే డబ్బులు జమ అయ్యాయి అని మండల వ్యవసాయ శాఖ అధికారి జి శ్రీలక్ష్మి తెలిపారు. మండలంలో ఈనెల మూడో తేదీ నుంచి ఈ నెల3వ తేదీ నుంచి 108 మంది రైతుల నుండి 212 మెట్రిక్ టన్నులు ధాన్యము కొనుగోలు చేయడం జరిగిందన్నారు. మొదటి రోజు అనగా ఈ నెల 3 వ తేదీన మేఘవరం సచివాలయం కు చెందిన రైతు సూరాడ హేమ లత కు చెందిన 16 క్వింటాలు ధాన్యం కొనుగోలు చేశామని అన్నారు. సదురు రైతుకు 14వ తేదీ సాయంత్రం32640 రూ జమ కావడంతో ఆమె చాలా ఆనందం వ్యక్తం చేసింది. 21 రోజుల్లో డబ్బులు జమ చేస్తామని ప్రభుత్వం చెప్పి 11 రోజులకే డబ్బులు జమ చేసినందుకు సి. ఎం.జగన్మోహన్ రెడ్డికి అలాగే ఇంత త్వరగా డబ్బులు జమ కావడానికి సహకరించిన వ్యవసాయ శాఖ అధికారి జి.శ్రీలక్ష్మి, తాసిల్దార్ జె. చలమయ్య, సివిల్ సప్లై డిటి రాము, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎల్ సుప్రియ, ధాన్యం కొనుగోలు చేసిన సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## శ్రీకాకుళం కార్పోరేషన్ దోమల నియంత్రణ గాలికొదిలేశారు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నా దోమలు అధికారుల జోలికి పోవడం లేదేమో, అందుకే వారు నిమ్మకు నిరేత్తినట్టు, తమకు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. శ్రీకాకుళం పట్టణం వాసులకు దోమల సమస్య తీవ్రమై, నానా అవస్థలు పడుతున్నారు. వాటి నుంచి తప్పించుకోలేక బెంబేలెత్తిపోతున్నారు. దోమ కాట్లుతో కాళ్లు, చేతులు మండిపోతున్నాయిని గగ్గోలు పెడుతున్నారు. దీనితో దోమలు భయానికి సాయంత్రం ఐదు గంటలకే తలుపులు వేసుకుంటున్నారు. ఇళ్ళల్లో దోమల మందులు వాడుతున్నా, ఫలిత ముండటం లేదు. రాత్రి నిద్రకు భంగంగా మారిన దోమల నియంత్రణకు వాడని మందులు లేదు. చేయని ప్రయోగంలేదు. ముఖ్యంగాశీతకాలం కావడంతో ఈ దోమలు మరింతగా పెరిగిపోయాయి. దీనితో పగలు కూడా దోమ కాట్లు తప్పడంలేదు. దీనితో డెంగ్యూ, మలేరియా వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉందని ప్రజలు భయపడుతున్నారు. అందుకే దోమల నివారణకు ప్రతీ కుటుంబము నెలకు వేయి రూపాయిలు వరకూ ఖర్చు చేస్తుంది. అయినా ఫలితం ఉండటంలేదు. కార్పొరేషన్ అధికారులు కూడా తమకేమి సంబంధం లేనట్టు, దోమల నియంత్రణ చర్యలను గాలికి వదిలేశారు. సకాలంలో పన్నులు కట్టించుకొనే, అధికారులు ప్రజా సమస్యల్ని పట్టించుకొనకపోతే ఎలా అని జిల్లా ప్రజా సమస్యల పరిష్కార వేదిక అధ్యక్షులు బి వి రవిశంకర్ ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఈ దోమల సమస్యను పరిష్కారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## రంగస్థల నటుడి కుటుంబాన్ని రాష్ట్ర అవుట్ సోర్సింగ్ డైరెక్టర్ పరామర్శ

విశాలాంధ్ర-బూర్జ : మండలంలోని లాభాం గ్రామానికి, చెందిన సుప్రసిద్ధకళాకారులు అంపోలుశ్రీరాములు (80)కుటుంబాన్ని స్వగృహం వద్ద రాష్ట్ర అవుట్ సోర్సింగ్ డైరెక్టర్ కందాపు గోవిందరావు బుధవారం పరామర్శించారు. శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీరాములు రంగస్థల కళాకారుడిగా ఖ్యాతి గడించి శ్రీకాకుళం జిల్లాకు వన్నెతెచ్చారని కొనియాడారు. అంతటి మహనీయులు దురదృష్టవశాత్తు బస్సు ప్రమాదంలో గాయపడి స్వర్గస్తులవడం కళా రంగానికి తీరని లోటని ఉద్వేగానికి లోనయ్యారు. వీరు గత పుష్కర కాలంగా ఆమదాలవలసలో ఉంటూ ఆశక్తి గల వారికి రంగస్థల పద్యాలు చెబుతూ రంగస్థలంపై ఉన్న మక్కువను చాటుకున్నారని తెలిపారు.ఆంజనేయ, నక్షత్రక, గయుడు, యయాతి, ధర్మరాజు మొదలగు పాత్రలలో నటించి ప్రజల మన్ననలకు పాత్రుదయ్యారని అన్నారు.ఆయన గాత్రంతో వేలాది మంది శ్రోతలను, కళాభిమానులను తన అభిమానులుగా మలుచుకోగలిగారని అన్నారు. స్వర్గీయ మూడక్ల కృష్ణారావు (ప్రముఖ సంగీత సాహితీవేత్త, దర్శకులు) వద్ద పలు పాత్రలు నేర్చుకొని, స్వర్గీయ లోలుగు వీరభద్రాచారి నాటకం ట్రూపులో పనిచేశారని తెలిపారు. అమరపు సత్యం గారు, యడ్ల గోపాలరావు, కురిటి సత్యం నాయుడు, బి.నాగరాజు మొదలగు ట్రూపులలో నక్షత్రక పాత్రలో మంచి పేరు ప్రఖ్యాతులు గడించారని తెలిపారు. గోవిందరావుతోపాటు శ్రీరాములు అభిమానులు, శిష్యబృందం, కళాకారులు కె.సూరపు నాయుడు, బి శ్యామల రావు మాష్టర్, బి.హరిబాబు,గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొని వారి ఆత్మకు శాంతి కలగాలనీ, సద్గతి కలగాలని దేవుని ప్రార్థించి, వారి కుటుంబానికి భరోసా కల్పించారు.

## అడిగిన ప్రతి ఒక్కరికి పని కల్పించాలి

ఎంపీపీ రోణంకి ఉమామల్లేశ్వరరావు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మహాత్మగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా అడిగిన ప్రతి ఒక్కరికి జాబ్ కార్డు తయారు చేసి పనులు కల్పించాలని స్థానిక మండల పరిషత్ అధ్యక్షుడు రోణంకి ఉమామల్లేశ్వరరావు అన్నారు. బుధవారం మండలపరిషత్ సమావేశ మందిరంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.ఫణీంద్రకుమార్ ఆద్వర్యంలో ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు, సచివాలయ అధికారులు, సర్పంచ్‌లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతన దారులు రెండుపూట్ల, రోజుకు 6గంటల సమయం తప్పని సరిగా పనిచేయాలని, అలా పని చేసిననాడే వారికి రోజుకు రూ. 250లు పైన వేతనం వస్తుందని తెలిపారు. ఈ విషయంలో క్షేత్ర సహాయకులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. అలాగే ప్రతీ ఫీల్డ్ అసిస్టెంట్ స్థానిక సర్పంచ్‌లతో చర్చించి గ్రామసభలు నిర్వహించి గ్రామానికి సంపద సృష్టించిన పనులు గుర్తించి పనులు నిర్వహించాలన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి జాబ్ కార్డు ఇచ్చి 100 రోజులు పనులు చేయించాలన్నారు. గతంలో మాదిరిగా తూతూ మంత్రంగా పనులు నిర్వహించటం ప్రసుత్తం కుదరదని, ఇప్పుడు టెక్నాలజీతో ఎన్ఆర్ఈజీఎస్‌తో పనులు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యాక్షురాలు దుక్కరోజారాణి, ఏపీడీ మురళికృష్ణ, ఇంజినీరింగ్ అధికారి జి.హరిప్రసాద్, ఏపీఓ అరుణ్ కుమార్, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## అచ్చెన్నాయుడును కలిసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి:టెక్కలి నియోజకవర్గం శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర అద్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడును జిల్లాలోని పలు మండలాల నుంచి టీడీపీ నాయకలు, కార్యకర్తలు తన క్యాంపు కార్యాలయం నిమ్మాడలో బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకొని సమస్యలపై చర్చించారు. ఈ మేరకు మండలం విశ్వనాథపురం పంచాయతీ దువ్వారపుపేట గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ ఎస్సీ విభాగం మండలం ప్రతినిధి దువ్వారపు సింహాచలం అచ్చెన్నాయుడును కలిసి ఎస్సీలు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు. అలాగే పలు పంచాయతీల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు కలిసి సమస్యలు వివరించారు.

## కాలుష్యాన్ని పునరుత్పాదక శక్తి వనరుల ద్వారా తగ్గించవచ్చు

విశాలాంధ్ర-నరసన్నపేట : మానవాళి మనుగడకు ముప్పు తేచ్చే కాలుష్యాన్ని పునరుత్పాదక శక్తి వనరుల వాడకంతోనే తగ్గించవచ్చని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, డా.పి.లత అన్నారు. బుధవారం జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం సంధర్భంగా స్థానిక డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ప్రిన్సిపాల్, లత మాట్లాడుతూ పునరుత్పాదక శక్తి వనరులైన సౌర శక్తి, పవన శక్తి, అలల శక్తి, బయో శక్తి మొదలైనవి ఉపయోగించటం ద్వారా కాలుష్యాన్ని నివారించవచ్చని తెలిపారు. పునరుత్పాదక శక్తి వనరులు ఉపయోగించనట్లయితే కాలుష్యం ఎక్కువవుతోందని, వాతావరణంలో అకస్మాత్తుగా జరిగే పరిణామాలకు కాలుష్యమే కారణమన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పి.ఢిల్లీశ్వరరావు, ఎం.శాంతి హేమ్, డా.పి.అన్నాజీరావు, పి.శ్రీవిద్య, ఏ.పవిత్ర, ఎం.హారిక, పి.అనూష; కె.రెయ్యమ్మ, జె.మనీష్ కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యం పట్ల శ్రద్ధ ముఖ్యం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : ప్రతీ వ్యక్తీ ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా సాధించగలరని, చెడు వ్యసనాలకు అలవాటు పడితే చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రక్కర్స్ ప్రాజెక్టు మేనేజర్ ఎం. మాధవరావు అన్నారు. ఎయిడ్స్ వ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ రబీన్‌కుమార్ పాఢి సమక్షంలో బెజ్జిపురం యూత్ క్లబ్ ఆధ్వర్యంలో కళాజాతను ప్రదర్శించారు. దశల వారిగా ఎయిడ్స్ వ్యాప్తి, నివారణోపాయాలు, ఆరోగ్య నియమాలు, కరొనా ప్రభావం తదితరాలను నాటిక ద్వారా విద్యార్థులకు వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎస్.పేటలో మాతా ట్రాన్స్‌పోర్టు ఆవరణలో వాహనదారులకు అవగాహన కల్గించారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు సంతోష్ కుమార్, ధుర్యోదన, బృంధావన్, సీతమ్మ, లోకేష్, ట్రాన్స్‌పోర్టు ఆఫీస్ మేనేజర్ ప్రతాప్ ప్రధాన్, శర్మ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమమే అజెండా

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం: రాష్ట్రంలో ప్రతీ కుటుంభం సంతోషంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రధాన ఉద్దేశ్యమని వై.సి.పి నియోజకవర్గ కన్వీనర్ పిరియా సాయిరాజ్ అన్నారు. బుధవారం తేలుకుంచి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ పాతిర్ల రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించగా జెడ్పీ ఛైయిర్‌పర్సన్ పిరియా విజయ తదితరులతో కలిసి సాయిరాజ్ ఇంటింటికీ వెళ్ళి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అవలంభిస్తున్న విధనాల కోసం వివరించారు. సంక్షేమమే అజెండాగా తమ ప్రభుత్వ పాలన సాగిస్తున్నామని తెలిపారు. ఏమైనా సమస్యలు వుంటే తెలుసుకొని అక్కడికి అక్కడే సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటూ, నేరుగా ప్రజలతో కలసి వారి కష్టసుఖాలను తెలుసుకుని, మెరుగైన పరిపాలన అందివ్వాలనే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజల అవసరాలు సమస్యలు తెలపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీడ్ ఏ.పి చైర్మన్ సాడి శ్యాంప్రసాద్, డి.సి.ఎం.ఎస్ ఛెయిర్‌పర్సన్ సల్లా సుగుణ, దేవరాజ్, కంచిలి ఎమ్పీపి పైలా దేవదాస్, వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు దక్కత నూకయ్య, వి.ఆర్.ఓ ఉప్పాడ రాజు, ఆశి పురుషోత్తం, ప్రేమ్ కుమార్, రంపత్ని చిట్టిబాబు, బీన డిల్లిరావు తదితరులు పాల్గొన్నారు.

## సేవ చేయడమే లక్ష్యం

విశాలాంధ్ర-మెళియాపుట్టి : గ్రామాలలోని ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ నాయకులు మామిడి గోవిందరావు పనిచేస్తున్నారని మాజీ సర్పంచ్, పట్టుపురం ఎంపీటీసీ ప్రతినిధి నంబాల వెంకటరావు అన్నారు. దేశం పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికి ఎంజీఆర్ పేరుతో ఎంజీఆర్ యువసేన సభ్యులు మండలంలో గల జంతురు, వెంకటాపురం, బందపల్లి, పోలూరు, నాయుడు పోలూరు, దీనబంధుపురం, జలకలింగ పురం, మర్రిపాడు సీ, తదితర గ్రామాలలో బుధవారం నాడు పర్యటించి కరపత్రాలను పంపిణీ చేయడంతో పాటు భవిష్యత్ కాలంలో మామిడి గోవిందరావు చేపట్టే కార్యక్రమాలను గురించి ప్రజలకు వివరించారు. మామిడి అప్పారావు సేవా ట్రస్ట్ ద్వారా గ్రామాలలో బడి, గుడి నిర్మాణాలతో పాటు కష్టాలలో ఉన్న వారికి తనకు తోచిన విధంగా సహాయపడుతూ ప్రతి ఒక్కరికి ముందుకు నడిపించడమే లక్ష్యంగా ఎంజీఆర్ సాగుతున్నారని ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తూనే భవిష్యత్ కాలంలో చేపట్టే అంశాలు ప్రజలకు వివరించారు ఈ పర్యటనలో నంబాల వెంకటరావు తో పాటు కొవిలాపు సురేష్, జీ. శ్రీను, జమ్మన బైరేగి, ఓరిసి భీమారావు, తాడేల షణ్ముఖరావు, నక్క వెంకట్రావు, నారాయణ, చిన్నబాబు, పలువురు నాయకులు, కార్యకర్తలు, యువకులు ప్రజలు తదితరులున్నారు.

## రైతులకు అండగా ప్రభుత్వం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : రాష్ట్రంలో సీఎం వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేసి పథకాలు అందిస్తుందని జిల్లా పరిషత్ ఛెయిర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. బుధవారం మండలంలో తేలుకుంచి గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్పీపి బోర పుష్ప, జెడ్పీటీసి ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్ పాతిర్ల రాజశేఖర్, వై.సి.పి నియోజకవర్గ కన్వీనర్ పిరియా సాయిరాజ్, రెడ్డిక కార్పొరేషన్ ఛైర్మన్ దుక్క లోకేశ్వర రావు తదితరులతో కలిసి ప్రారంభించారు. రైతు ధైర్యంగా ఉండాలని, మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని నాయకులు ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో సీడ్ ఏ.పి చైర్మన్ సాడి శ్యాంప్రసాద్, డి.సి.ఎం.ఎస్ ఛెయిర్‌పర్సన్ సల్లా సుగుణ, దేవరాజ్, కంచిలి ఎమ్పీపి పైలా దేవదాస్, వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు దక్కత నూకయ్య, వి.ఆర్.ఓ ఉప్పాడ రాజు, ఆశి పురుషోత్తం, ప్రేమ్ కుమార్, రంపత్ని చిట్టిబాబు, బీన డిల్లిరావు తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు ఆదేశాలతో పెన్షనుదారులకు ఎరియర్స్ మంజూరు

విశాలాంధ్ర-పొందూరు : రాజకీయ కక్షసాధింపులో భాగంగా నిలిపివేసిన 9 మంది టీడీపీ సానుభూతిపరుల పెన్షను ఎరియర్సు్ని హైకోర్టు ఆదేశాలతో మంజూరు చేసారు. ఈమేరకు అధికారులు గ్రామసర్పంచ్ బుడుమూరు పోలినాయుడు సమక్షంలో 9 మందికి ఎరియర్స్ చెక్కులను అందించారు. వివరాలలోకి వెళితే గత పంచాయతీ ఎన్నికల్లో గ్రామ సర్పంచ్గా టీడీపీ నాయకులు బుడుమూరు పోలినాయుడు గెలుపొందారు. పంచాయతీ ఎన్నికల్లో తనకు ఓటు వేయలేదనే కక్షతో వైసీపీ తరుపున సర్పంచ్గా పోటీచేసిన వ్యక్తి 9మంది సామాజిక పింఛన్లను తొలగించగా 22 మంది చేయూతను నిలిపి వేసారు. పించనార్థులు రాంగ్ అదంటి కేషన్ వేసి పించను రాకుండా వలంటీర్లద్వారా కుట్ర చేస్తారని సర్పంచ్ పోలినాయుడు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంవద్ద నిరసన చేపట్టారు. అయినప్పటికీ పించను మండల అధికారులు వైసీపీ నాయకుల ఒత్తిడితో పునరుద్ధ రించలేదు. 6 నెలల పాటు పించను అద్దుకోవడంతో బాదితుల తరుపున సర్పంచ్ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన హైకోర్టు తక్షణమే పించన్లు పునరుద్ధరించాలని హైకోర్టు ఆదేశించడంతో పింఛను పునరుద్ధరించినప్పటికీ ఎరియర్స్ మంజూరు చేయకపోవడంతో మరళ హైకోర్టును ఆదేశించడంతో గతనెల 28 ఎరియర్సు బాదితులకు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. అయినప్పటికీ ఎరియర్స్ బకాయిలు మంజూరు కాకపోవడంతో స్పందన కార్య క్రమంలో భాదితులు ఫిర్యాదు చేస్తారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో బకాయిల చెక్కులను బుధవారం అందించారు. రాజకీయకక్షతో అర్హు లకు అన్యాయం చేసిన కోర్టులో న్యాయం జరిగిందని సర్పంచ్ అన్నారు.

## ట్రిపుల్ ఐటీలో మరిన్ని మౌలిక సదుపాయాలు

### ఆర్జీయూకేటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ కే సి రెడ్డి

విశాలాంధ్ర-ఎచ్చర్ల: శ్రీకాకుళం ఐటి క్యాంపస్ లో మరిన్ని మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆర్జీయూకేటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ కేసిరెడ్డి తెలిపారు. ఇక్కడ క్యాంపస్‌ను బుధవారం ఆయన సందర్శించిన సందర్భంగా మాట్లాడారు. విద్యార్థుల సౌకర్యార్థం ప్రతి తరగతి గదిలో ఎల్సిడి ప్రొజెక్టర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. విద్యా ర్థులకు ప్రభుత్వం అందజేస్తున్న వసతి, విద్యా దీవెన పథకాలకు చెందిన డబ్బులు తల్లుల ఖాతాలో జమకావడంతో సాంకేతిక ఇబ్బందులను అధిగమించనున్నట్లు తెలిపారు. ఇక్కడ క్యాంపస్‌లో విద్యార్థుల ఆరోగ్య సేవలు కోసం భాగంగా ఇద్దరు వైద్యులను డిప్యూటేషన్ విధానంలో నియమించా లని జిల్లా అధికారులకు నివేదించామన్నారు. విద్యార్థులకు కొత్తగా తీసుకువచ్చిన ముఖ ఆధారిత హాజరులో వస్తున్న సాంకేతిక ఇబ్బందులను నివారించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే తల్లిదండ్రులను ఈ ప్రాంగణంలో రాత్రిపూట బస చేసేందుకు వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. వచ్చే నెలలో సంక్రాంతి సెలవులకు విద్యార్థులను తీసుకెళ్లేందుకు తప్పని సరిగా తల్లిదండ్రులు క్యాంపస్‌కు రావలసిన పనిలేదని, విద్యార్థులను బృందాలుగా చేసి పంపించనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. అలాగే అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వ హించారు. ఈకార్యక్రమంలో ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు, ఓఎస్డి ప్రొఫెసర్ ఎల్ డి సుధాకర్ బాబు, అకాడమిక్ డీన్ మోహన్ కృష్ణ చౌదరి, ఏవో సత్యనారాయణ పాల్గొన్నారు.

# భావనపాడు బీచ్‌లో పిక్నిక్ సందడి

### ఇసుక తిన్నెల పై కేరింతల కొడుతున్న యువకులు
### సముద్రంలో స్నానాలు చేస్తున్న యువతీ యువకులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : భావనపాడు బీచ్ లో, ఆదివారం జనసంద్రంతో సందడిగా నెలకొంది. కార్తీక మాసం కావడంతో పిక్నిక్ లు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ప్రతిఏటా ఈ తీరప్రాంతాల్లో ఒరిస్సాతో పాటు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలతో పిక్నిక్ హంగామ, సంతరించుకుంది. ఈ తీరప్రాంతాల్లోనే ఒక పక్క విశాలమైన సముద్రం తీరం, మరోవైపు ప్రకృతి పులకరించే విధంగా కొబ్బరి చెట్లు ,జీడిచెట్లు కలిగి వుండడంతో చూపరులకు కనువిందు చేసే విధంగా ఇక్కడ వాతావరణం నెలకొంది. సందర్శకులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా, సున్నితమైన సముద్ర తీరం ఉండడంతో వేలాదిమంది ప్రజలు ఈ ప్రాంతాలకు కుటుంబాలతో సహా వెళ్లి సముద్రానికిఆనుకొని ఉన్న తోటల్లో వంటవార్పులు చేసుకుని కుటుంబం సమేతంగా వనభోజ కార్యక్రమాలు జరుపు కుంటున్నారు .ప్రతి ఏటా వేలాదిమంది పిక్నిక్‌ల సంద ర్భంగా రాజకీయ నాయకులు ,ఉపాధ్యాయ వర్గాలు, కళాశాల పాఠశాల విద్యార్థిని విద్యార్థులు, ప్రజలు వారికి దగ్గరలో ఉన్న తీరప్రాంతానికి వెళ్లి, సరదాగా కొంత సమయము గడుపుతూ ఉంటారు. సందర్శకులు సముద్రము ఒడ్డున స్నానాలు చేసేటప్పుడు, పోలీస్ శాఖ పర్యవేక్షణలోనే జరుగుతున్నాయి. అలాగే కార్తీక మాసం ముగియడంతో, పిల్లలు పెద్దలు స్నేహితులు బంధువులుతో ఆప్రదేశం అంతా జనసంద్రంతో నిండిపోయింది. యువకులు కేరింతలు కొడుతూ అలలతో పోటీపడ్డారు. ఇసుక తిన్నెల పైన యువతి యువకులు నృత్యాలు, డాన్సులతో, క్రీడారంగాలను ప్రదర్శించి సందర్శకులకు ఆకట్టుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భావనపాడు మెరైన్ సీఐ దేవుళ్ళు సిబ్బంది, ఆధ్వర్యంలో రక్షణ చర్యలు ఏర్పాటు చేశారు. సముద్ర తీర ప్రాంతం ఆదివారం పిక్నిక్ ఒక వేదికగా మారిందని సందర్శకులు స్థానికులు ప్రజలు పేర్కొన్నారు.

# పలాస కాశీబుగ్గ అనకొండలు

### ఇష్టారాజ్యంగా... అక్రమణలు..?

విశాలాంధ్ర-పలాస : పలాస కాశీబుగ్గ జంట పట్టణాలకు ఆభరణమైన నెమలికొండపై అధికార పార్టీ నేతల కన్ను పడి అనకొండలా మింగేస్తున్నారు. దీపం ఉండగానే ఇళ్లు చక్కబెట్టుకునే చందంగా మరో 18 నెలలు అధికారం ఉంటుండగానే అక్రమణదారులు రెచ్చిపోతున్నారు. ఇప్పటికే

సూదికొండ, నెమలికొండలు అక్రమణలకు గురై తమ రూపును మార్చుకున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి ఇటువైపు చూస్తే కొండలే అనవాళ్లుగా జంట పట్టణాలకు ఉండగా నేడు అవి కనుమరుగయ్యే పరిస్థితి గోచరిస్తుంది. సూదికొండ సమీపంలో దేవాలయం నిర్మాణం పేరిట కొండ పైభాగం పట్టాలు ఉన్నాయన్న సాకుతో దిగువ భాగం మొత్తం ఆక్రమించేస్తున్నారు. అవి ప్లాట్లుగా చదును చేసి ఇళ్ల స్థలాలు విక్రయిస్తూ లక్షలాది రూపాయలు ద్వితీయ శ్రేణి నాయకులు సంపాదిస్తున్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో సర్వే నెంబరు 51లో 60 ఎకరాల విస్తీర్ణంలో నెమలికొండ ఉంది.

కొండ దిగువన వంద మీటర్లు వరకు చుట్టూ గృహాలు నిర్మిస్తుండడంతో కొండ పోరంబోకు భూములకు డిమాండ్ వచ్చింది. డి.పట్టా భూములే ఎకరా కోటి రూపాయలు వరకు ధర పలుకుతోంది. దీంతో కొంతమంది అధికార పార్టీ నాయకులు ఈ కొండను ఆక్రమించి ఇష్టారాజ్యంగా స్థలాలు విక్రయిస్తున్నారు. గతంలో అధికార పార్టీకి చెందిన నాయకుడుకి క్వారీ కోసం ఇదే సర్వే నెంబరు 3 హెక్టార్ల స్థలాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. జంట పట్టణాలకు కంఠాభరణంగా ఉన్న సూదికొండ నుంచి కంకర తవ్వకాలు చేయడం ప్రజల్లో చైతన్యం వచ్చింది. వారు ఆందోళన చేపట్టడంతో క్వారీ మూతపడింది. గతంలో క్వారీ కోసం మట్టిని తవ్వగా మిగిలిన స్థలాలను చదును చేసి కంచె వేసి భారీ స్థాయి ఆక్రమణలకు పాల్పడుతున్నారు. కొండకు అనుకొని సుమారు 2 ఎకరాలకు పైగా ఆక్రమించి ప్లాట్లుగా విభజించి ఇప్పటికే అమ్మకాలు జరిపారు. గతంలో ఈ స్థలాల్లో తమకు పట్టాలిచ్చారని ముగ్గురు వ్యక్తులు రెవిన్యూ అధికారుల దృష్టికి తీసుకువెల్లారు. ప్రస్తుతం పట్టాలున్నవారంతా అధికార పార్టీ నాయకులు కావడం ఇక్కడ విశేషం.

ఈ పట్టాలు నకిలీవిగా రెవిన్యూ అధికారులు అనుమానిస్తున్నారు. ఇప్పటికే పలాస కాశీబుగ్గ పరిసర ప్రాంతాల్లో కనుచూపు మేర ప్రభుత్వ స్థలాలు కనిపించడం లేదు. గతంలో తెలుగుదేశం పార్టీ నాయకులుగా వ్యవహరించిన కొంతమంది తమ అక్రమ అక్రమణల వ్యాపారం కొనసాగించేందుకు అధికార పార్టీలో చేరి ఇక్కడ కూడా తమ హవా కొనసాగిస్తున్నారు. అలాగే ప్రైవేటు వ్యక్తుల స్థలాలను కూడా అక్రమణలకు గురవుతున్నాయి. ముఖ్యంగా వైశ్య కులానికి చెందిన వారికి సంబంధించిన స్థలాలు అక్రమణలకు గురి కావడం జరుగుతోంది. ఇప్పటికైనా రెవిన్యూ అధికారులు ఒక అడుగు ముందుకు వేసి అక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.